# వీడని బంధం

జె.బి.వాణి



గుడిసె చిల్లులోంచి చెంపలకు సోకు బాలభానుని లేతకిరణాలు తెల్లగా తెల్లవారిందని తెలిపాయి రామన్నకి. తన గుండెలకి హత్తుకుని, నిర్మలంగా నిద్రపోతున్న పాపని చూస్తు, పాపతలని నెమ్మదిగా, అప్యాయంగా, నిమిరి చాపమీదనుంచి లేచాడు రామన్న, ఆ కదలికకు మెలుకువ వచ్చిన పాపకూడా లేచి కూర్చుంది.

పాపకి మొహంకడిగి, స్నానంచేయించి వంటకి ఉపక్రమించాడు రామన్న.

రామన్నకి పాపతోటిదే లోకం! పాపని విడిచి ఉండలేని రామన్నకి, రిక్షా తోలటానికి వెళ్ళటంకూడా కష్టంగానే ఉంటుంది. కానీ పొట్టకూటికి తప్పదుగా మరి! ... ఏదో తెలియని వీడనిబంధం వారిరువురిమధ్యా!... 'ఇదే గాబోలు జన్మజన్మల అనుబంధం' అన్పించేది రామన్నకి. "లేకపోతే మేడల్లో, మిద్దెల్లో పెరిగే మల్లెపువ్వులాంటి పాపెక్కడ? బురదలో.. గుంటలో...పెరిగిన గడ్డిపువ్వులాంటి తనెక్కడ? ... తామిరువురి మధ్యా ఏమిటీబంధం?!" ఏ అప్యాయతకీ నోచుకోని తన జీవితానికిదొక అనురాగపు జల్లు ...! ఎండిపోయిన తన గుండెకొక చిగురింత.! ఎడారిలాంటి తన బ్రతుక్కి ఒయాసిస్సులాంటిదీ పాప...! అని రకరకాలుగా తలపోసేవాడు 'పాపే తన సర్వస్వం!' అనుకునే రామన్న.

ఇన్నాళ్ళూ జీవితమంటే...తనకు లభించని డబ్బూ...! హోదాలలోనే ఉందనుకునేవాడు తను. కానీ ఇప్పుడే తెల్సింది!... మనుషులకి కావలసింది డబ్బు కాదు - తియ్యని ఆత్మీయతనీ, హోదా కాదు ఓ కమ్మని అప్యాయతనీ...! అలా అనుకునేటప్పుడు రామన్నలో ఆనందాకాశపు ఆశాకిరణం వెల్లివిరిసి, వేయి గంతులేసినట్లైంది.

ఒకవసంతం నిండుగా నవ్వింది.. రామన్నా పాపల అనుబంధంలో...

ఆరోజు మధ్యాహ్నం 'టీస్టాల్' ప్రక్కగా రిక్షా పెట్టి, 'టీ' త్రాగుతున్న రామన్నకి, పక్కనున్న ఆసామి చూస్తున్న పేపర్లో ఒక ఫోటో కన్పించింది. తాగుతున్న టీకప్పు పక్కనపెట్టి, "ఏంటయ్యగోరు? మా పాపమ్మ ఫోటో ఈడుంది?" అంటూ అమాయకంగా, ఆశ్చర్యంగా ఆయన్నడిగాడు రామన్న...

"ఈపాప కన్పించటంలేదట! వెతికి తీస్తొచ్చినవాళ్ళకి బహూమతిస్తామని ప్రకటించారు. పాపం! వాళ్ళమ్మకి పాపమీద బెంగతో జబ్బుగా ఉందట!" అని సారాంశం చెప్పాడు....

ఆసామి రామన్నకి.

రామన్నకి అమాంతం నెత్తిన పిడుగుపడ్డట్టయింది. నరాలు స్వాధీనం తప్పాయి. పెద్దపెట్టున దుఃఖం వచ్చింది. అతనిమనస్సు ఆవేదనతో కొట్టుమిట్టాడింది. "అయితే తనిక పాపనొదులుకోవాల్సిందేనా? పాపని వాళ్ళమ్మా నాన్నలకి అప్పగించేయాల్సిందేనా? పాపలేందే తను బ్రతకలేడే? ఎలామరి?! పెంచిన పాపమీద తనకే ఇంత ప్రేముంటే, మరి కన్నవాళ్ళకింకెంత ప్రేముండాలి? అనుకున్న రామన్న మనసు 'పాపనివ్వాలా? వద్దా?' అని తేల్చుకోలేక పోతోంది.

ఇంటికెళ్ళగానే పాపనెత్తుకుని, బస్టాండ్‌కు బయలుదేరాడు, ఆలోచనలతో ... భారమైన మనస్సుతో ... ముందు పాప తల్లిని బ్రతికించాలనే కర్తవ్య దీక్షతో....

* * *

అదొక పెద్దభవంతి! ఇంటినిండా నౌకర్లు, చాకర్లు! రామన్న పిలుపుతో బయటి కొచ్చిన నౌకరు-ఆ దృశ్యంచూసి నివ్వెరపోయి, హడావుడిగా లోపలికి వెళ్ళి పాప తండ్రిని పిలుచుకొచ్చాడు. తనుకనిపించిన ఆనందాతిరేకంతో పొంగిపోతున్న తండ్రిని పాప గుర్తించింది కొంతసేపటికి...! పాపతల్లి మనసు-పాపను చూడటంతో వేయిఔషధాలొక్కసారిగా సేవించిన బలాన్ని పుంజుకుంది రామన్నకి పదే పదే తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు పాప తల్లిదండ్రులు.

రామన్న వెళ్ళిపోతుంటే పాప పెద్దపెట్టున ఏడ్చింది గుకపట్టి...కానీ...వెనక్కి తిరిగి చూడకూడదని...దృఢంగా నిశ్చయించుకున్న రామన్న....కళ్ళనుంచీ ధారగాకారే అశ్రువులని చొక్కాతో తుడుచుకుంటూ, పెద్దపెద్ద అంగలేసుకుంటూ, బయటికొచ్చాడు. అతని గుండెనెవ్వరో బలంగాపట్టి పిండుతున్నట్లుంది. గతం మదిలో గంతులేసి - పాపతో తన పరిచయం గుర్తుకొచ్చి - అతని హృదయాన్ని దుఃఖపూరితం చేసింది.

* * *

క్రిక్కిరిసినజనసందోహం కోలాహలంతో రకరకాల నవ్వుల పువ్వులతో, పసినవ్వుల కేరింతలతో, లేజవ్వనుల ఉల్లాసంతో... వింతగా నిండి ఉంది ఆ ఊరి సంత.

సంత చూడాలనే ఉత్సాహంతో... ఆ రోజే ఆ ఊరు వచ్చాడు రిక్షా రామన్న! ప్రతి మనిషినీ చిత్ర విచిత్రంగా ఊపేస్తున్న రంగులరాట్నం చూసేసరికి రామన్న మనస్సులో రంగుల హరివిల్లు చెంగున వెల్లి విరిసింది!!

ఆత్రుతతో ... ఉత్సాహంతో అటువైపు పరిగెడుతున్నాడు రామన్న! అంతలో...!... అతని కాళ్ళకడ్డుపడి ఘొల్లుమని ఏడుస్తుందొక చిన్నారి! ఎవరి ధ్యాసల్లో వారున్నారేగానీ...ఆ పసిదాని ఏడుపు ఎవ్వరికీ పట్టటం లేదు. జాలి పేగుల రామన్న మటుకు ఊరుకోలేకపోయాడు. గబగబా ఆ పాప నెత్తుకుని, జనం రద్దీ కాస్త తక్కువవున్న వైపుకు తీసికెళ్ళాడు ఆ పాపను...

నిండిన మేఘాల్లా వర్షిస్తున్న ఆ పసిపాప కళ్ళు, అమాయకంగా, భయంగా చూశాయి రామన్నవైపు...

"ఏరమ్మా పాపా నువ్వు? నీ పేరేటి? ఎందుకేడుత్తుండావ్? మీ అమ్మా, నాన్నా ఏరు?" అని బుజ్జగించి, లాలనగా అడిగాడు రామన్న. వస్తున్న వెక్కిళ్ళని అపుకుంటూ, "నా పేరూ, పదమ! అమ్మ, నాన్నా లాలేదు, నేనూ, సుబ్బయ్యా వొచ్చాం!" అంటూ ఏదో వచ్చీరాని మాటల్తో చెప్తోంది పాప.

"మరి సుబ్బయ్యేడుండాడు?" అడిగాడు రామన్న, పాప బుగ్గపై ముద్దెట్టుకుంటూ... "నన్నిక్కడే వదిలేసి. ఎల్లాడు!" ముద్దు ముద్దు మాటల్తో చెప్తోంది పాప...

"మీ నాన్న పేరేటి? మీ అమ్మ పేరేటి?" అడిగాడు రామన్న.

"అమ్మా-నాన్నే" చేతులు త్రిప్పుకుంటూ అమాయకంగా జవాబిచ్చింది పాప.

"మరి మా ఊరొచ్చేసి, మా ఇంట్లోఉంటావేటి?" అని ప్రశ్నించాడు ఏం చేయాలో తెలియని రామన్న, అదోలా గమ్మత్తుగా తల ఊపింది పాప.

"పోలీస్ స్టేషన్‌లో విడిచి వెళదామా?" అనుకున్నాడు రామన్న. కానీ ... పాపను చూసిన వేళా విశేషమేమోగానీ అంత తేలిగ్గా వదిలేయాలనిపించలేదు. అంతగా ఆ చిన్నారి తల్లీ, తండ్రీ వచ్చి అడిగితే, అప్పుడు చూస్తుందాం-లే! అనుకున్నాడు రామన్న.

ఏడుపు మొఖం పెట్టబోతున్న పాపకి బిస్కెట్లూ, బిళ్ళలూ కొనిచ్చాడు రామన్న. ఏడుపు సంగతి మరచిపోయి, పాప వాటిని పరమానందంగా తింటోంది.

యాపిల్ పండ్లలాంటి బుగ్గలతో, మిలమిల మెరిసే కళ్ళతో, అప్పుడే విచ్చిన అందాల గులాబీ లాగున్న పాప నెత్తుకుని నడుస్తున్న రామన్నకి, ఏదో తెలియని అనుభూతి! ఆ అనుభూతిలో కించిత్ గర్వం! తొణికిసలాడింది. 'ఈ పాప నాది! నా సొత్తు!' అన్న భావంతో...

* * *

'కానీ...' పాప ప్రస్తుతం నాది కాదుగా! ..." అనే ఆలోచనతో వర్తమానంలోకి వచ్చిన రామన్న మనస్సు వ్యధతో నిండిపోయింది. నాలుగురోజులు అతిభారంగా గడిచాయి రామన్నకి. పాపలేని గుడిసె బోసిపోయి, బావురుమన్నట్లుంది.

ఆ రోజు రాత్రల్లా, పాప జ్ఞాపకాలతో, బరువెక్కిన మనస్సుతో ఏ తెల్లవారుఝామునో నిద్రలోకి జారిన రామన్నకి, ఉదయం ఎనిమిది గంటలకి తడికె చప్పుడవుతుంటే, మెలుకువ వచ్చింది. ఎదురుగా ఒక అపరిచితవ్యక్తి. అతను చెప్పిన మాటలు విని గుండె లవిసిపోయినట్లైంది రామన్నకి...

పాపకి అపరిమితమైన జ్వరమట. 'రామన్నా! రామన్నా!' అని తననే కలవరిస్తోందట! పాప తండ్రి తనని తీసుకురమ్మన్నారట!

పాపను తను లాలించి, అనునయించి, ఆత్మీయతనూ, అనుబంధాన్నీ ఏర్పరచుకున్నట్లుగానే, పాపకూడా తనని, అమాయకపు హృదయంతో ప్రేమించిందన్నమాట..! విడలేని, విడరాని మమతని ఏర్పరచుకుందన్నమాట... ఆ ఊహ మదిలో మెదలగానే ఆకాశపుటంచుల్ని తాకినంత ఆనందం పెల్లుబికింది రామన్నలో!

అంతే!... శరవేగంలా దూసుకుపోయాడు రామన్న పాప దగ్గరికి...

మంచంమీద అచేతనంగా పడుకున్న

'తిరుపతి క్షేత్ర మహాత్మ్యం'లో



బి. సరోజా దేవి

పాప, "పాపా!" అన్న రామన్న పిలుపుతో అతి ప్రయత్నంతో కళ్ళు తెరిచింది. వెంటనే పాప కళ్ళు ఆనందంతో మిల మిలా మెరిసాయి. పాప తల్లిదండ్రుల ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

సంకెలలా పెనవేసుకున్న వారిరువురి పీడని బంధం చూసి "మీది జన్మబంధం మాత్రమే కాదు!" అన్నట్లుగా ఆనందంగా హర్షించింది ప్రకృతి...! వర్షించింది మేఘం...!